క్లుప్తంగా...

నేడు భగవద్గీతపై హబ్సిగూడలో కవి సమ్మేళనం

సాక్షి, హైదరాబాద్: వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే భగవద్గీతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో తొలిసారి భగవద్గీతపై సత్యశోధన– శక్తిసాధన, శ్రీ భగవద్గీత పబ్లిసిటీ సొసైటీ ఆధ్వర్యంలో కవిసమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు శ్రీ భగవద్గీత పబ్లిసిటీ సొసైటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు హబ్సిగూడ మూడో వీధిలోని ఇం.నెం .2–19/4 లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. గీతావధాని డాక్టర్ యడ్లపల్లి మోహన్‌రావు ఆధ్వర్యంలో శ్రీభగవద్గీతపై సమీక్ష సమావేశం ఉంటుందన్నారు. వివరాలకు మొబైల్ నెంబర్ 9490440178లో సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: ఇంటర్మీడియేట్ విద్యార్థినికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, టీటీడీ ఎల్‌ఏసీ మెంబర్ వెల్లాల రామ్మోహన్ ఆర్థిక సాయం అందించారు. అమీర్‌పేటకు చెందిన గణేష్ కుమార్తె లక్ష్మీప్రసన్న ఓ ప్రైవేటు కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఆమె చదువు కోసం కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న వెల్లాల రామ్మోహన్ శనివారం రూ.10 వేలు అందించారు.

నేడు విద్యార్థులకు సైకిల్ రైడ్

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని లాలాగూడలో ఉన్న తక్షశిల పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఐదు నుంచి 10వ తరగతి విద్యార్థులకు సైక్లింగ్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సైకిల్ రైడ్ ఈవెంట్ తార్నాక పెట్రోల్ పంప్ నుంచి ఎన్‌జీఆర్ఐ డౌన్ తార్నాక వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈవెంట్‌లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఆవిర్భావం అనంతరం పదేళ్లలో పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందిందని ఆ శాఖ జనరల్ మేనేజర్ అంజిరెడ్డి అన్నారు. శనివారం ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పదేళ్లలో తెలంగాణలో పర్యాటక అభివృద్ధి–మేనేజ్‌మెంట్ దృక్కోణం అనే అంశం పై సదస్సు జరిగింది. కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాములు అధ్యక్షత వహించగా అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్రంలో అభివృద్ధి చెందిన వివిధ పర్యాటక ప్రాంతాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొ.నరేష్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని పలు అక్రమ నిర్మాణాలను శనివారం ఏబీవీపీ నాయకులు జీవన్ శ్రీహరి ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులు కూల్చివేశారు. నిర్మాణాలను అడ్డుకున్న ఏబీవీపీ నాయకులపై దాడి చేసిన కబ్జాదారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా అక్రమ నిర్మాణాల ప్రాంతాలను ఓయూ ఉద్యోగ సంఘాల నాయకులు, అధ్యాపక సంఘం నాయకులు సందర్శించి భూములను కబ్జా చేస్తే సహించేదిలేదన్నారు. విద్యార్థులపై దాడిని ఖండిస్తున్నామన్నారు.

'ఎఫ్‌ఓబీ' ప్రారంభించాలంటూ నిరసన

లాలాపేట: ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించాలని శనివారం తార్నాకలో సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణం పూర్తయి దాదాపు 7 నెలలు గడుస్తున్నా దాన్ని ప్రారంభించకపోవడంపై ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్‌తో పాటు రోడ్డుకు అడ్డంగా పెట్టిన బారికేడ్లతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని వెంటనే ప్రారంభించాలని నాయకులు శ్రీనివాస్, బాబు, షేక్ లతీఫ్, యాదగిరి, జోగురాములు, కళ్యాణ్, ఖాసీం డిమాండ్ చేశారు.

'గృహలక్ష్మి'తో రూ. 3 లక్షల ఆర్థిక సాయం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో పర్యటన



బస్తీసభలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ రామస్వామి కంపౌండ్ బస్తీవాసులకు ఇళ్లు నిర్మించి ఇస్తాం.. మీ ఇళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత నాది అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానికులకు హామీ ఇచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన బస్తీ సభలో ఆయన మాట్లాడారు. గృహలక్ష్మీ పథకం కింద ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ప్రభుత్వం తరఫున ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందేలా చూస్తానన్నారు. దీనికి సంబంధించి త్వరలో రెవెన్యూ అధికారులు మీ బస్తీకి వచ్చి గృహలక్ష్మీ పథకం విధి విధానాలు వివరించి మీకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. దాదాపుగా యాభై ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్న మీకు ఇళ్లపై ఇంకా సర్వహక్కులు రాలేదని అయినా మీకు, మీ ఇళ్లకు ఎలాంటి ఢోకా లేకుండా నేనుంటానన్నారు. రామస్వామి కంపౌండ్, బర్కల్‌బస్తీలో ప్రజలు రాకపోకలు సాగించడానికి వీలుగా ఎస్ఎస్ ఫ్లోరింగ్ వేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, నాయకులు సుధాకర్, నాగభూషణం, నరేష్, కుమార్ యాదవ్, ఎల్. వెంకటేషన్, సురేష్, వెంకటరమణ, లక్ష్మీపతి, ప్రేమ్ పాల్గొన్నారు.

హైదర్‌బస్తీలో పర్యటన..

సికింద్రాబాద్ బైబిల్ హౌస్ సమీపంలోని హైదర్‌బస్తీలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గ్రౌండ్‌లో పార్కు నిర్మాణం చేపట్టాలని, సీసీ రోడ్లు వేయించాలని, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ ప్రజలు సూచించిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణ, హైదర్‌బస్తీ అసోసియేషన్ నాయకులు నాగెల్లి శ్రీనివాస్, వినయ్, బాలాజీ, జగన్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



యువతతో మాట్లాడుతున్న క్రిశాంక్

కంటోన్మెంట్: యువత రాజకీయాల్లోకి రావాలని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ పిలుపునిచ్చారు. 'కేఫ్ పాలిటిక్స్'లో భాగంగా వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న స్థానిక యువతతో కలిసి శనివారం కంటోన్మెంట్ ఐదో వార్డు పరిధిలోని లక్కీ కేఫ్‌లో మాట్లాడారు. నగర యువత తమ ఖాళీ సమయాల్లో ఎక్కువగా కేఫ్‌లలో గడిపే సమయాల్లో వివిధ అంశాలపై చర్చలు సాగిస్తూ ఉండటం గమనించానని ఈ నేపథ్యంలోనే కేఫ్ పాలిటిక్స్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నాలుగు వారాలు వివిధ ప్రాంతాల్లోని యువతను కలిసి ఆధునిక రాజకీయాలు, స్థానిక సమస్యలపై వారితో చర్చించానని అన్నారు. ఆయా అంశాలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం చూపుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటి, సోనా, వినీత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు పునరుద్ధరణకు వినతి..

కంటోన్మెంట్: పికెట్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని క్రిశాంక్ టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్‌లో అతిపెద్ద డిపో పికెట్, కంటోన్మెంట్ డిపోలు కూతవేటు దూరంలోనే ఉన్నా పికెట్ మీదుగా వెళ్లే బస్సు సర్వీసును రద్దు చేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు అన్నానగర్ ప్రాంతంలోనూ బస్టాప్‌ను పునరుద్ధరించాలన్నారు. బస్తీవాసులు అధిక సంఖ్యలో ఉండే రసూల్‌పురా, అన్నానగర్ వాసులు సుదూరంగా ఉండే బస్టాప్‌కు నడిచి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో గతంలో లక్ష్మీనగర్ మీదుగా రూట్ నెం. 91, అన్నాగర్ మార్కండేయ దేవాలయం మీదుగా వెళ్లే 26ఏ బస్సులను పునరుద్ధరించాలని కోరగా ఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ పురస్కారానికి సంధ్య ఎంపిక



పింజర్ల సంధ్య

సికింద్రాబాద్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈ నెల 20న రవీంద్రభారతిలో నిర్వహించనున్న విద్యాప్రగతి వేడుకల్లో పురస్కారం పొందేందుకు సీతాఫల్‌మండి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని పింజర్ల సంధ్య ఎంపికైంది. 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఎంఈసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో 476/500 మార్కులు సాధించి తెలంగాణ టాపర్‌గా నిలిచింది. ఉత్తమ ఫలితం రాబట్టిన సంధ్యకు రవీంద్రభారతిలో పురస్కారం అందించడంతోపాటు రూ.10వేల నగదును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆనంద్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.కవిత తెలిపారు. రాష్ట్ర స్థాయి టాపర్‌గా నిలువడంతోపాటు పురస్కారానికి ఎంపికైన సంధ్యను అధ్యాపకులు రేణుకాబాయి, బాలరాజు, సద్మావతి, ధనలక్ష్మి, బబిత, స్టాఫ్ సంజీవరెడ్డి, చెన్నయ్య, ప్రశాంతి అభినందించారు.

ఘనంగా 'మర్రి' జన్మదిన వేడుకలు



మర్రి రాజశేఖర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కంటోన్మెంట్: బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్ ఆవరణలో జరిగిన వేడుకలకు మంత్రి మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, పీర్జాదీగూడ మేయర్ జక్కా వెంకటరెడ్డి, జవహర్ నగర్ మేయర్ కావ్య, సీనియర్ నేతలు శ్రీగణేశ్, లాస్య నందిత, నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం, శ్యామ్ కుమార్, నళిని, పార్టీ నేతలు ముప్పిడి మధుకర్, పెద్దాల నర్సింహ, నయీమ్, రాజు సింగ్ హాజరై మర్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు మర్రి రాజశేఖర్ రెడ్డి సతీమణి మమతతో పాటు మంత్రి కేటీఆర్‌ను కలిశారు.

ట్విట్టర్ టాప్ ట్రెండింగ్‌లో ఘనత..

రసూల్‌పురా: బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజక వర్గాల ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా ట్విట్టర్ టాప్ ట్రెండింగ్‌లో అరుదైన ఘనత సాధించారు. ట్విట్టర్ ట్రెడింగ్‌లో జాతీయ స్థాయిలో టాప్ 5వ స్థానంలో చోటు సాధించారు. మర్రి రాజశేఖర్ రెడ్డి హెబీడీ పేరిట ఆయన అభిమానులు పెట్టిన హాష్‌టాగ్‌ను ఎక్కువ మంది ఫాలో కావడంతో ఈ మేరకు ట్రెండింగ్‌లోకి వచ్చారు.శనివారం మధ్యాహ్నం మల్లారెడ్డి గార్డెన్స్‌లో జన్మదిన వేడుకలు కొనసాగుతూ ఉండగానే ఆయన అభిమానులు అనౌన్స్ చేయడంతో అక్కడ ఉన్నవారంతా కేరింతలలో హోరెత్తించారు.

మరియమ్మ సేవలు మరువలేనివి

గాంధీఆస్పత్రి : ఎర్రగడ్డ టీబీ ఆస్పత్రి రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ మరియమ్మ సేవలు మరువలేనివని ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని క్రిస్టియన్ ప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. అనారోగ్యంతో ఈ నెల 14న మృతి చెందిన ఆమె భౌతిక కాయానికి శనివారం మెట్టుగూడ సెమిట్రీలో అంత్యక్రియలు నిర్వహించారు. మూడు దశాబ్దాల పాటు వైద్యవృత్తిలో కొనసాగిన ఆమె అనేక సామాజిక సేవ కార్యక్రమాలతోపాటు వైద్యశిబిరాలు నిర్వహించి నిరుపేదలకు ఉచిత వైద్యం అందించారని కొనియాడారు. మరియమ్మ కుమారుడైన తెలంగాణ క్రిస్టియన్ ఫోరం అధ్యక్షుడు సుధీర్ చాటల్ల, నాయకులు రాజీవ్‌సాగర్, కృపానందం, శ్యాంసన్, ఎడ్వర్డ్ సామ్యూల్, కెన్నడీ, ఫ్రాంక్లిన్, యెహెజ్కేలు, రాధామాథ్యూస్, జెరుషలేం మత్తయ్య, యోహాను, పలువురు పాస్టర్లు అంత్యక్రియాల్లో పాల్గొన్నారు.

టాయిలెట్ క్లీనింగ్ మిషన్ వితరణ



క్లీనింగ్ మిషన్‌ను అందజేస్తున్న నాయకులు

లాలాపేట: లాలాపేటలోని ప్రభుత్వ పాఠశాల(గడి స్కూల్)కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి టాయిలెట్ క్లీనింగ్ మిషన్‌ను వితరణ చేయగా శనివారం ఆ మిషన్‌ను స్థానిక బీజేపీ నాయకులు హెచ్ఎం ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో రాము వర్మ, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాసచారి, పోచయ్య, హరి పాల్గొన్నారు.



చదువుతోనే జీవితాల్లో మార్పు



రాత పుస్తకాలు అందజేస్తున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: చదువుతోనే పేదల జీవితాల్లో మార్పులు వస్తాయని శ్రీగణేశ్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత శ్రీగణేశ్ అన్నారు. నూతన విద్యా సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఏడు వేల మందికి పైగా విద్యార్థులకు ఉచితంగా రాత పుస్తకాల పంపిణీ చేపట్టారు. రోజులుగా బొల్లారం ఆదర్శనగర్, కళాసీగూ, మారేడుపల్లి గాంధీనగర్‌లో, శనివారం ఆరోవార్డు సీతారాంపూర్, మూడో వార్డు అంబేద్కర్ సొసైటీ, రెండో వార్డు గన్ బజార్, ఐదోవార్డు కాకాగూడ, ఏడోవార్డు తిరుమలగిరి సాయిబాబా హట్స్ ప్రాంతాల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అంతకు ముందు సికింద్రాబాద్ వైఎంసీఏ చౌరస్తాలోని గణేశ్ దేవాలయ ఆవరణలో నోటు పుస్తకాలు పూజ చేయించారు. కార్యక్రమంలో శ్యామ్‌కుమార్, కురుమూర్తి, లక్ష్మీ, రాజు, యాదగిరి, ఎర్రయ్య, గౌతమ్, శరత్, శ్రీకాంత్, ప్రేమ్, రామ్, శ్యామ్, మల్లేశ్, శ్రీకాంత్, శరత్, మణిదీప్, ఖలీల్ పాల్గొన్నారు.

శిథిలం.. భయం



చిలకలగూడ: చిలకలగూడ ఠాణా భవనం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. సెల్లార్‌తో పాటు పిల్లర్లు, స్లాబులు, కిటికీలు వద్ద పెచ్చులు ఊడి బలహీనంగా మారిన భవనాన్ని ఖాళీ చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో అదే భవనంలో ఠాణా కొనసాగడం గమనార్హం. చెరువు స్థలంలో ఠాణా భవనం నిర్మించడంతో పాటు భవనానికి ఆనుకుని నాలా ప్రవహించడం, వరదనీరు నాలాలోకే చేరడం, సాయిల్ టెస్ట్ ప్రక్రియ చేపట్టకుండానే భవనాన్ని నిర్మించడంతో పిల్లరు దృఢత్వాన్ని కోల్పోయి ప్రమాదకరంగా మారినట్లు సంబంధిత నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పెద్ద ప్రమాదం జరగక ముందు సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా హెచ్‌పీఎస్ గ్రాడ్యుయేషన్ డే



సనత్‌నగర్: హైదరాబాద్‌పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) గ్రాడ్యుయేషన్ వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఉత్తీర్ణులైన 103 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేశారు. 39 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. 1983 బ్యాచ్ పూర్వ విద్యార్థి, అప్పటి హెడ్‌బాయ్, కాస్మోడ్ కన్సల్టెంట్ కో–ఫౌండర్ హిమాన్షు తాంబే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను చదువుకున్న పాఠశాలలో జరిగే వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. హెచ్‌పీఎస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని బయటకు వెళ్తున్న ప్రస్తుత విద్యార్థులు పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ స్కంద్‌బాలి మాట్లాడుతూ.. కలలను సాకారం చేసుకునేందుకు పట్టుదల, నిబద్ధతతో ముందుకు సాగాలన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రపంచాన్ని జయించాలనే తపనతో టోపీలను గాలిలోకి ఎగురవేసి ఆనందాన్ని వ్యక్తపరిచారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



సూరారం లక్ష్మి

అడ్డగుట్ట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. భువనగిరిలోని మోత్కూర్‌కు చెందిన సూరారం లక్ష్మి(45) రెండ్రోజుల క్రితం అడ్డగుట్టలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె కనిపించకుండా పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో..



రాజు

తుకారాంగేట్‌లోని శాస్త్రినగర్‌కు చెందిన సీహెచ్. రాజు(52) నెల 16న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసినా ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



చురుగ్గా ఆలయ పునర్నిర్మాణ పనులు



ఆలయ ప్రాంగణంలో సమావేశమైన కమిటీ ప్రతినిధులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఈఓ రాజేష్ కుమార్ మాట్లాడారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టామని, పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి ప్రధాన ఆలయ ద్వారబంధ ప్రతిష్ఠ, గర్భాలయం, ముఖ మండప నిర్మాణంతో సింహభాగం పనులు పూర్తయ్యావని, వచ్చే ఏడాది జూన్ నాటికి అన్ని వసతులు, సౌకర్యాలతో సర్వాంగ సుందరమైన ఆలయాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. జూలై 16వ తేదీన ధన్వంతరి హోమం నిర్వహిస్తామని, ఆలయ కౌంటర్‌లో భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేణుగోపాలరావు, దేవాదాయశాఖ స్థపతి వలినాయకం, శిల్పి వెంకటేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్ కుమార్, డోనర్ శంకరరెడ్డి, ప్రతినిధులు ఆత్మారామ సూర్య సుబ్రహ్మణ్యం, బాలభాస్కర్, నారాయణన్, శివశంకరన్, సుజయ్‌ప్రకాశ్ పాల్గొన్నారు.

గృహ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తేవాలి



పద్మారావునగర్: ఇళ్లలో పనిచేసే కార్మికుల సంక్షేమం, రక్షణకు ప్రభుత్వం సమగ్ర చట్టం తీసుకురావాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. అంతర్జాతీయ గృహ కార్మికుల వారోత్సవాన్ని శనివారం హమాల్‌బస్తీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇళ్లలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని, కార్మికులకు ఈఎస్ఐ, ఆరోగ్య, ప్రమాద భీమా సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. వృద్ధ కార్మికులకు పెన్షన్ సదుపాయాన్ని కల్పించి, పనిచేసే చోటే డబుల్ బెడ్రూమ్ నిర్మించి ఇవ్వాలని కోరారు. గృహ కార్మికులు ఆత్మగౌరవంతో జీవిస్తూ హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ కార్మికులు సుజాత, జ్యోతి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ, ఉపాధి

రాంగోపాల్‌పేట్: టెక్ మహేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని సంస్థ మేనేజర్ మౌల ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు కంప్యూటర్ బేసిక్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ టైపింగ్, ఇంటర్నెట్ కాన్సెప్ట్‌లలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పది ఉత్తీర్ణత, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు కలిగిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు భోలక్‌పూర్‌లోని ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీ హాల్‌లోని అప్నా–టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ వృత్తి శిక్షణా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

